సాక్షి జగిత్యాల

గురువారం । 5 । జనవరి । 2023



స్నాక్స్ అందించాలని వినతి

జగిత్యాల: టెన్త్ విద్యార్థులకు స్నాక్స్ అందించాలని టీఆర్టీఎఫ్ నాయకులు డీఈవో జగన్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.



మేరు సంఘం కార్యవర్గం

సారంగాపూర్: తుంగూరు మేరు సంఘాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గట్ల రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు.

గరిష్టం/కనిష్టం
29.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదు అవుతుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రుల్లో తనిఖీలు



ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే కల్వకుంట్ల

కోరుట్ల: స్థానిక ప్రభుత్వ సామాజిక వైద్యశాల, హాజీపురలో కొత్తగా నెలకొల్పుతున్న బస్తీదవాఖానలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు బుధవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, హాజీపుర బస్తీదవాఖానను మంత్రి హరీశ్‌రావు గురువారం ప్రారంభించనున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్యే ఆస్పత్రులకు చేరుకుని ఏర్పాట్లు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆస్పత్రుల్లో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అనంతరం మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. మంత్రి పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తే చేపడతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎస్‌ఐ సతీశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

జిల్లాకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్



ఎస్పీ సింధూశర్మతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్

జగిత్యాలక్రైం: జిల్లాలో ఏడురోజుల పాటు శిక్షణ తీసుకునేందుకు హైదరాబాద్‌లోని హకీంపేట 99 బెటాలియన్‌కు చెందిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బుధవారం జగిత్యాలకు చేరుకుంది. 70మంది బలగాలతో కూడిన ఈ బృందం తొలుత కలెక్టర్ రవి, ఎస్పీ సింధూశర్మను కలిసి రిపోర్ట్ చేసింది. ఏడురోజుల పాటు వీరు జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో విధులు నిర్వర్తించనున్నారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండర్ రాహుల్ రామారావు, ఇన్‌స్పెక్టర్స్ బాలస్వామి, డీఎస్ మాస్కర్, జయప్రకాశ్, విష్ణుకుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అన్నీ అక్రమాలే..!

- రాయికల్‌లో రూ.19లక్షలు దుర్వినియోగం
- కాజేసిన ముగ్గురు రీసోర్స్ పర్సన్లు
- వారంలో వాపసు చేస్తామని హామీ
- ఇప్పటికీ జమచేయని వైనం
- స్త్రీనిధి రుణాలు పక్కదారిపై ఆందోళన

జిల్లాలోని కోరుట్ల మెప్మాలో సుమారు రూ.80లక్షల మహిళా సంఘాల రుణాల దుర్వినియోగం ఘటన మరువకముందే రాయికల్‌లోని ఓ మహిళా సమాఖ్యలో రూ.19లక్షల గోల్‌మాల్ తెరపైకి రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సభ్యులు చెల్లిస్తున్న స్త్రీనిధి రుణ వాయిదాల సొమ్మును ఆర్పీలు బ్యాంకులో జమచేయకుండా సొంతానికి వాడుకున్నారని అధికారులు గుర్తించారు. దీనిపై హెచ్చరించగా.. వారంలో చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీఇచ్చి నెలలు గడుస్తున్నా ఆర్పీలు పైసా జమచేయడంలేదు.



జగిత్యాల: జిల్లాలోని రాయికల్ బల్దియాలో స్త్రీనిధి సొమ్ము పక్కదారి పట్టింది. మహిళా సాధికారత కోసం గతంలో గ్రామీణ మహిళా సంఘాలకు స్త్రీనిధి ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేశారు. అందులో రాయికల్ మేజర్ గ్రామపంచాయతీ కూడా ఉంది. ప్రస్తుతం రాయికల్ పంచాయతీ.. మున్సిపాలిటీగా హోదా దక్కించుకుంది. 2022లో రాయికల్ మొత్తం 8 సంఘాలు ఉండగా, అందులోని ఓ మహిళా సమాఖ్యకు మంజూరైన స్త్రీనిధి రుణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చింది. ఇందుకు బాధ్యులైన ఆర్పీలు.. వారంలోనే సొమ్ము తిరిగి చెల్లిస్తామని పీడీకి రాతపూర్వకంగా లేఖ అందించారు.

సభ్యులు చెల్లిస్తున్నారు.. ఆర్పీలు నొక్కేస్తున్నారు..

- మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు స్త్రీనిధి ద్వారా జిల్లాలో విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నారు.
- కొందరు వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందుతున్నారు.
- ప్రతినెలా క్రమం తప్పకుండా రుణ వాయిదాలు చెల్లిస్తూ వస్తున్నారు.
- ఇందులో కొందరు మెప్మా అధికారులకు చెల్లిస్తున్నారు.
- మరికొందరు నేరుగా స్త్రీనిధి బ్యాంక్‌లో జమచేస్తున్నారు.
- తెలిసిన వారే కదా అని మరికొందరు నేరుగా ఆర్పీలకు ఇస్తూ బ్యాంకులో చెల్లించాలని కోరుతున్నారు.
- సరిగ్గా ఇక్కడే అవకతవకలు చోటుచేసుకుంటున్నారు.
- కొందరు ఆర్పీలు బ్యాంకుల్లో రుణవాయిదాలు జమచేయకుండా సొంతానికి వాడుకుంటున్నారు.
- ఇందులో రాయికల్‌లోని ఓ సమాఖ్య సభ్యులు ఆర్నెల్లపాటు చెల్లించిన రూ.19.89 లక్షలు సొంతానికి వాడుకున్న ఆర్పీలు.. నేటికీ తిరిగి జమచేయడంలేదు.
- దుర్వినియోగం వెలుగులోకి రావడం, స్త్రీనిధి అధికారులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఆ సొమ్ము చెల్లిస్తామని ఆర్పీలు అధికారులకు చెప్పారు.

అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు?

- స్త్రీనిధి ద్వారా రుణాలు పొందిన మహిళలు.. ఆర్పీలు, అధికారులకు రుణ వాయిదాలు ఆరునెలలుగా క్రమం తప్పకుండా చెల్లిస్తూ వస్తున్నారు.
- కానీ, ఆ సొమ్ము స్త్రీనిధి బ్యాంకులో జమకావడంలేదు.
- ఆర్పీలు వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిసినా అధికారులు ఎందుకు రికవరీ చేయడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.
- అవకతవకల్లో అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే సందేహాలు కూడా తలెత్తుతున్నాయి.
- దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే మరన్ని నిజాలు వెలుగులోకి రావడమే కాదు.. జిల్లావ్యాప్తంగా ఇంకా ఎన్ని మహిళా సంఘాల్లో నిధులు దుర్వినియోగం అయ్యాయనే విషయం కూడా బహిర్గతమవుతుందని పలువురు మహిళలు, మెప్మా సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

సెప్టెంబరులో వెలుగులోకి..

స్త్రీనిధి రుణవాయిదాల చెల్లింపులో అవకతవకలు జరిగాయని 2022 సెప్టెంబర్‌లో వెలుగులోకి వచ్చింది. దీనిపై అధికారులు విచారణ జరిపారు. అప్పుడు ఆర్పీలుగా పనిచేసిన ఇద్దరు, ఒక సంఘం అధ్యక్షురాలు దాదాపు రూ.19.89 లక్షలు సొంతానికి వాడుకుంటున్నట్లు బయటపడింది.

రికవరీ చేస్తున్నాం

స్త్రీనిధి ద్వారా మహిళలు తీసుకున్న రుణవాయిదాలు దుర్వినియోగమైనట్లు గుర్తించాం. ఆ సొమ్మును బాధ్యుల నుంచి క్రమంగా రికవరీ చేస్తున్నాం. ఇప్పటికే ఆర్పీలకు నోటీసులు కూడా జారీచేశాం.

– సునీత, డీఎంసీ

నాస్తికం పేరిట హిందుత్వంపై దాడి



వెల్గటూరు మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించిన పురోహితులు

- రోడ్డుపై బైఠాయించిన పురోహితులు

వెల్గటూర్(ధర్మపురి): హిందూ దేవతలు సరస్వతీదేవీ అమ్మవారు, అయ్యప్పస్వామిపై నాస్తికులు రేంజర్ల రాజేశ్, బైరి నరేశ్ అనుచితి వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వెల్గటూర్, ఎండపల్లి, ధర్మారం మండలాలకు చెందిన పలువురు పురోహితులు బుధవారం వెల్గటూర్ అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పత్తిపాక వెంకటేశ్, తంగళ్లపల్లి చక్రపాణి, మేరుగు మురళి వీరికి మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. పత్తిపాక వెంకటేశ్ మాట్లాడుతూ నాస్తికత పేరిట హిందుత్వంపై కొందరు దాడులు చేస్తున్నారన్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ప్రజాసేవతో ప్రజల్లోకి వెళ్లాలని ఆయన సూచించారు. అంతేకానీ హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు. మరోసారి ఇలా చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రాజేశ్, నరేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మూడు మండలాల అర్చకులు, పురోహితులు, అయ్యప్ప దీక్షాస్వాములు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి



మాట్లాడుతున్న ఈఈ ప్రకాశ్‌రావు

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు– మన బడి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని నీటిపారుదలశాఖ ఈఈ సంతు ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం పెగ్గెర్ల, భూషణరావుపేట, సిరికొండ, పోతారం గ్రామాల్లో మన ఊరు– మన బడి పథకం పనులను పరిశీలించారు. పనులు చేపట్టే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ పనులు గతేడాది జూన్‌లో పూర్తిచేయాల్సి ఉండగా.. ఇప్పటికీ దృష్టి సారించకపోవడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పనులపై చొరవ చూపాలని అధికారులు పేర్కొన్నారు. డీఈ శ్రీనివాస్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు ప్రాతిపదికన మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా పనిచేసేందుకు ఆసక్తి, అర్హులైన వారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రవి తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబీబీఎస్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం తదితర అర్హతలు గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు జగిత్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్ **jagtial.telangana.gov.in** లో అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

‘డబుల్ ఇళ్ల’ డ్రా.. రసాభాస



ఆర్డీవో కార్యాలయం నిరసన తెలుపుతున్న మహిళలు

- జాబితాలో అనర్హులు ఉన్నారని ఆగ్రహం
- రోడ్డెక్కిన మహిళలు.. అడ్డుకున్న పోలీసులు



ధర్నా విరమింపజేస్తున్న పోలీసులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని పేదల కోసం బుధవారం చేపట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ రసాభాసగా మారింది. ఎమ్మెల్సీ కవిత సహకారంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జగిత్యాలలోని పేదల కోసం 4,520 డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు మంజూరు చేయించారు. వీటికోసం సుమారు 5వేల దరఖాస్తులు రాగా, దాదాపు 3 వేల మందిని అర్హులుగా గుర్తించారు. తొలివిడతలో 2,520 ఇళ్లు డ్రా పద్ధతిన కేటాయించేందుకు స్థానిక మినీస్టేడియంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో మైనార్టీలకు 12శాతం, ఎస్సీలకు 17శాతం, ఎస్టీలకు 6శాతం, దివ్యాంగులకు 5శాతం ఇళ్లు కేటాయించారు. తొలిరోజు ఉదయం 11 గంటలకు మైనార్టీలను డ్రా పద్ధతిన ఎంపిక చేశారు. మొత్తం 1,191మంది మైనారిటీలను అర్హులుగా గుర్తించగా 302 మందిని డ్రాలో ఎంపిక చేశారు. డ్రాలో ఎంపికకాని వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాతబస్టాండ్ వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి తరలివెళ్లారు. మహిళలు అందరూ ఒకేసారి ఆందోళనకు దిగడంతో మధ్యాహ్నం చేపట్టాల్సిన డ్రాను వాయిదా వేశారు. అంతకుముందు అనర్హులకు అధికారులు డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. కొందరు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గొడవ అధికం కావడంతో ఇళ్ల కేటాయింపు డ్రాను రద్దు చేశారు. ప్రజలు భారీసంఖ్యలో తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమై భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి, జగిత్యాల, ధర్మపురి తహసీల్దార్లు వెంకటేశ్, నవీన్, మధు, నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్రాస్‌కంట్రీ పోటీలకు వసంత ఎంపిక



వసంత

జగిత్యాల: జాతీయస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు ఎండపల్లి మండలానికి చెందిన సబ్బ వసంత ఎంపికైనట్లు క్రాస్‌కంట్రీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముత్యయ్యరెడ్డి బుధవారం తెలిపారు. గత డిసెంబర్‌లో మహబూబాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వసంత ప్రతిభ కనబర్చిందన్నారు. ఈనెల 7 – 8వ తేదీ వరకు అసోం రాష్ట్రంలో జరిగే అండర్ – 20 క్రాస్‌కంట్రీ పోటీలకు వసంత హాజరవుతుందని పేర్కొన్నారు. గ్రామస్తులు ఆమెను అభినందించారు.

తడి చెత్తతో ఎరువు తయారీ



ఇబ్రహీంపట్నం(కోరుట్ల): తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ గ్రామపంచాయతీలకు సూచించారు. బర్దీపూర్ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. వైకుంఠధామం, క్రీడాప్రాంగణం, వర్మీకంపోస్ట్ షెడ్డు, గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన రికార్డులు పరిశీలించారు. వడ్డెరకాలనీ పాఠశాలలో మన ఊరు.. మన బడి పనులపై ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈనెల 20వ తేదీ వరకు వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సాట' సేవలు అభినందనీయం



చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి

జగిత్యాల: సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్(సాట) సేవలు అభినందనీయమని కలెక్టర్ రవి అన్నారు. మేడిపల్లి మండలం గోవిందారం గ్రామానికి చెందిన మొగిళ్ల శ్రీనివాస్ ఉపాధికోసం సౌదీ అరేబియా వెళ్లాడు. అక్కడ అకాల మృత్యువాత పడ్డాడు. దీంతో ఆయన కుటుంబానికి సాటా సభ్యులు అండగా నిలిచారు. కొన్ని విరాళాలు సేకరించారు. దీనికి సంబంధించిన చెక్కును కలెక్టర్ ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి కోసం వెళ్లిన వారు మృతిచెందడం బాధాకరమన్నారు. అలాంటి వారి కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మహేశ్, ముజ్జమ్మిల్ షేక్, ముల్లేశన్, మల్లేశ్ పాల్గొన్నారు.

ధర్మాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న శ్రీహరి తీర్థస్వామి

కథలాపూర్(వేములవాడ): ప్రతీవ్యక్తి భక్తిమార్గంలో పయనించాలని, ధర్మాన్ని కాపాడటం అందరి బాధ్యత అని సత్యానందాశ్రమాల పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి అన్నారు. బుధవారం రాత్రి చింతకుంటలోని శ్రీ తారకేశ్వర స్వామి ఆలయంలో శ్రీమహత్ భవద్గీత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్థస్వామి మాట్లాడుతూ.. ప్రజలు పోటీ ప్రపంచానికి దీటుగా ఆర్థికంగా రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. భక్తులు మానసిక ప్రశాంతత కోసం ప్రతీరోజు దేవుడికి పూజలు చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా సమయం కేటాయించాలని అన్నారు. భక్తులు ప్రత్యేక భజనలు చేశారు.

క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయండి



పనులు పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

మల్యాల(చొప్పదండి): క్రీడా ప్రాంగణాలు త్వరగా పూర్తి చేయాలని డీఆర్డీవో పీడీ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం మల్యాల మండలంలోని గొల్లపల్లి, రామన్నపేట, మల్యాలలోని క్రీడా ప్రాంగణాల పనులు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం మల్యాలలో నర్సరీ, క్రీడా ప్రాంగణం, ఆధార్ సీడింగ్, పల్లె ప్రగతి యాప్‌లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలుకు.. వీఆర్‌ఏల ఎదురుచూపు

- కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- మునుగోడు ఉప ఎన్నిక ముగిసినా స్పందించని ప్రభుత్వం



జగిత్యాల కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు వంటి హక్కుల సాధన కోసం వీఆర్‌ఏలు సమ్మె పేరిట సర్కారుపై పోరాటం చేశారు. కానీ నేటికీ వారికి ఫలితం దక్కలేదు. జగిత్యాల జిల్లాలోని 380 గ్రామ పంచాయతీల పరిధిలో 771 మంది వీఆర్‌ఏలు పని చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పని గంటలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యార్థుల కుల, ఆదాయం, నివాస, జనన, మరణ ధ్రువపత్రాల జారీలోనూ పని చేయాలి. ఉన్నత విద్య చదివిన వీఆర్‌ఏలు మాత్రం కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆపరేటర్లుగా ఇతర విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్ని చేస్తున్నా ప్రభుత్వం నెలకు రూ.10,500 గౌరవ వేతనమే ఇస్తోంది. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వీఆర్‌ఏలకు ఖాళీల ఆధారంగా పదోన్నతులు కల్పించాల్సి ఉండగా, ఆ ఊసే లేదు. వేతనం సరిపోక, కుటుంబ పోషణకు చేసిన అప్పులు చెల్లించలేక ఆవేదన చెందుతున్నారు.

అదనపు బాధ్యతలు..

గ్రామాల్లో ఏ ఘటన జరిగినా సంబంధిత సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించడం మాత్రమే వీఆర్‌ఏల విధి. గ్రామాలకు వచ్చే రెవెన్యూ అధికారులకు సహాయకులుగా వ్యవహరించాలి. కానీ వీఆర్వో వ్యవస్థ రద్దు చేసిన తర్వాత గ్రామాల్లో భూ వ్యవహారాలన్నీ వీరే చూసుకుంటున్నారు. కొన్ని మండలాల్లో డ్రైవింగ్ తెలిసిన వీఆర్‌ఏలతో వాహనాలు నడిపించడం, రాత్రివేళల్లో కార్యాలయాల్లో కాపలా ఉండటం వంటి పనులు చేయిస్తున్నారు.

80 రోజులు నిరవధిక సమ్మె..

వీఆర్‌ఏల సంఘం రాష్ట్రశాఖ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా వీఆర్‌ఏలు జూలై 25 నుంచి అక్టోబర్ 12 వరకు 80 రోజులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఉద్యోగ భద్రత, పేస్కేల్ అమలు, అర్హులకు పదోన్నతులు, కారుణ్య నియామకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎస్ సోమేశ్‌కుమార్ ప్రభుత్వం తరఫున వారితో మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నిక ముగియగానే డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు అక్టోబర్ 13న విధుల్లో చేరారు. అయితే ఉప ఎన్నిక గత నవంబర్ 6తోనే ముగిసినా ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలపై దృష్టి సారించడం లేదు. హామీలు ఎప్పుడు అమలవుతాయా అని వారు ఎదురుచూస్తున్నారు.

సమ్మె కాలానికి వేతనాలేవీ?

వీఆర్‌ఏలు చేపట్టిన సమ్మె కాలానికి వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఎలాగూ మర్చిపోయారని, సమ్మె సమయంలో చెప్పిన మాటలూ అంతేనా అంటూ వాపోతున్నారు. ఈ క్రమంలో మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నారు

జిల్లా సమాచారం	
రెవెన్యూ డివిజన్లు :	03
మండలాలు :	18
మున్సిపాలిటీలు :	05
గ్రామ పంచాయతీలు :	380
జిల్లాలో వీఆర్‌ఏలు :	771

దినసరి కూలీ కంటే తక్కువ



వీఆర్‌ఏలకు ఇస్తున్న వేతనం దినసరి కూలీ కంటే తక్కువ. పేస్కేల్ లేకుండా పని ఒత్తిడితో ఎన్నాళ్లు ఈ ఉద్యోగం చేయాలి. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారింది.

– షేక్ రఫీ హైమద్, వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు, మల్లాపూర్

అసెంబ్లీ సమావేశాల వరకు చూస్తాం



వీఆర్‌ఏలపై పనిభారం, ఒత్తిడి ఉంది. తగిన వేతనం, ఉద్యోగ రక్షణ లేవు. సమ్మె సమయంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి. అసెంబ్లీ సమావేశాల వరకు వేచి చూస్తాం.

– గంగారాం, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల

ధర్మపురికి వైద్యారోగ్య శాఖ మంత్రి

- నేడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంటు, డయాలసిస్ సెంటర్ ప్రారంభం



ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రి



ప్రారంభానికి సిద్ధమైన ఆక్సిజన్ ప్లాంటు

ధర్మపురి: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి, మెరుగైన వైద్యం అందించేందుకు వసతులు కల్పించారు. నూతనంగా సుమారు రూ.కోటితో 500 లీటర్ల సామర్థ్యం గల ఆక్సిజన్ ప్లాంటు, రూ.80 లక్షలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. వీటితోపాటు దవాఖానా వైద్య విధాన పరిషత్ ఆధీనంలోకి వచ్చాక 30 పడకల నుంచి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఇందులో ఐసీయూ ఏర్పాటు చేయనున్నారు.

మధ్యాహ్నం 2.45 గంటలకు దేవస్థానానికి..

ధర్మపురి పట్టణంలో గురువారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్నారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.45 గంటలకు ధర్మపురి లక్ష్మీనృసింహుని దేవస్థానానికి చేరుకుంటారు. ముందుగా సుమారు రూ.12 కోట్లతో నిర్మిస్తున్న మాతాశిశు ఆరోగ్య కేంద్రం పనుల ప్రగతిని పరిశీలిస్తారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంటు, డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అలాగే 10 పడకలతో కూడిన ఐసీయూ, 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు.

'అన్నీ నేనే చెప్పాలా.. మీరేం చేస్తున్నట్లు?'

- జగిత్యాల మార్కెట్ అధికారులపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్: అన్ని పనులు నేనే చెప్పాలా.. మీరేం చేస్తున్నట్లు.. అంటూ మార్కెట్ అధికారులపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ నక్కల రాధ అధ్యక్షతన మామిడి వ్యాపారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ అధికారుల తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వాలంతరీ స్థలం విషయమై.. అక్కడ ఏడీ ఆపిండు.. ఇక్కడ బీడీ ఆపిండు అంటారు.. ఏమైనా అంటే సంజయ్‌కుమార్ సారుకు కోపం ఎక్కువైంది.. లొల్లి పెడుతుండు అంటారు. వాలంతరీకి ముఖ్యమంత్రే చైర్మన్, స్వయనా ఆయనే రాసి, సంతకం పెట్టి, స్టాంప్ వేయించి ఇచ్చినప్పటికీ వాలంతరీకి చెందిన 10 ఎకరాలు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం స్వయంగా సంతకం పెట్టినా వాడెవడో ఆపిండు.. వీడెవడో ఆపిండు.. తమాషానా.. సీజన్ వస్తుంది.. రైతులకు, వ్యాపారులకు ఇబ్బందులు అవుతాయంటే, ముందట పడి అన్ని పనులు నేనే చేస్తున్నా.. అధికారులుగా మీరు చేయాల్సిన పనులు కూడా చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. 15 ఏళ్ల మార్కెట్ బాకీ రెండేళ్లలో కడుతమని వత్తిరి, రెండేళ్లు కరోనాయేనాయె, ఇన్‌కమ్ రాకపాయె.. ఎలా కడుతరు.. నేను అక్కడో, ఇక్కడో తిప్పలు పడి, వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యేను కలిసి మామిడి మార్కెట్ అభివృద్ధికి రూ.కోటి తీసుకువచ్చాను. ఏం పనులు చేయాలో మీకే ఒక క్లారిటీ లేదు, ఓ ప్లాన్ లేదు, ఎమ్మెల్యే కోపానికి వస్తే కోపానికి వచ్చిండ్రని అంటరు.. అంటూ అసహనం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

జగిత్యాల: దివ్యాంగులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ 214వ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధుల కోసం లిపి కనుక్కోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. రేషన్ కార్డు ఉన్న దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందిస్తామని పేర్కొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర హమాలీ సంఘానికి 5 గుంటల స్థలాన్ని కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసులు, క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. రాష్ట్రం ఏర్పడ్డాక జగిత్యాలలో 6 జూనియర్, ఒక డిగ్రీ, ఒక మెడికల్, ఒక నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు 1.50 లక్షల ఉద్యోగ నియమకాలు జరిగాయని, 90 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ.. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి ఆలయ ఉద్యోగి మృతి



వేణుగోపాల్‌రావు (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐల్నేని సుధాకర్‌రావు తనయుడు వేణుగోపాల్‌రావు(48) అకస్మాత్తుగా మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. వేణుగోపాల్‌రావు వేములవాడ రాజన్న అనుబంధ నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 15 ఏళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. గత 35 రోజులుగా అయ్యప్ప దీక్షలో ఉన్న ఆయనకు రెండు రోజులుగా విరేచనాలు అవుతున్నాయి. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, నాంపల్లి ఆలయ ఇన్‌చార్జి నరేందర్, అర్చకులు విజయ్‌లు వేణుగోపాల్‌రావు మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రెండు వ్యాన్‌లు ఢీ

- క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్
- ఆస్పత్రికి తరలింపు



క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం శివారులోని కేసీఆర్‌కాలనీ సమీపంలో బుధవారం రెండు డీసీఎం వ్యాన్‌లు ఢీకొట్టుకున్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఓ వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ అబ్దుల్‌గఫూర్ క్యాబిన్‌లో చిక్కుకోగా స్థానికులు బయటకు తీసి, సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి దారం ఉండాలు వేసుకుని సిరిసిల్ల వైపునకు వస్తున్న ఓ వ్యాన్ ఎదురుగా వస్తున్న మరో వ్యాన్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో నాగ్‌పూర్ నుంచి వస్తున్న వ్యాన్ డ్రైవర్ గఫూర్ తీవ్రంగా గాయపడ్డారు. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. ఇద్దరిని ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ధర్మపురి నుంచి జగిత్యాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతోపాటు వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ మోటార్లలోని వైరు చోరీ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

మల్యాల(చొప్పదండి): మండల కేంద్రంలో వరద కాలువ వెంట 25 వ్యవసాయ విద్యుత్ మోటార్లలోని సర్వీస్ వైరు, స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పంటల సాగు కోసం మల్యాల, ముత్యంపేట శివారులోని వరద కాలువకు రైతులు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లారు. మోటార్లలోని సర్వీస్ వైరును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. మల్యాల ఎస్సై మంద చిరంజీవికి ఫిర్యాదు చేశారు. ఉప సర్పంచ్ పోతరాజు శ్రీనివాస్, రైతులు నేరెళ్ల భూమారెడ్డి, మల్యాల గడ్డం రాకేశ్, గడ్డం రాజిరెడ్డి, మారు స్వామిరెడ్డి, పోతరాజు రాజిరెడ్డి తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో ..

రాయికల్(జగిత్యాల): మండలంలోని ఒడ్డెలింగాపూర్‌లో తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి, బంగారం, సిలిండర్ ఎత్తుకెళ్లారు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంజుల రాజ్‌కుమార్ మంగళవారం ఇంటికి తాళం వేసి, తన కుటుంబసభ్యులతో కలిసి కొండగట్టులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అదేరోజు అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి, తులం బంగారం, గ్యాస్ సిలిండర్ చోరీ చేశారు. బుధవారం తిరిగి వచ్చిన బాధితులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడి ఘటనలో నిందితులపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లె శివారు ఇందిరానగర్‌లో పూదూరి పోషయ్య కుటుంబసభ్యులపై దాడి చేసినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పోషయ్యకు చెందిన పైప్‌లైన్‌ను అదే గ్రామానికి చెందిన పూదూరి ఇందయ్య బుధవారం ధ్వంసం చేశాడు. అనంతరం పోషయ్యను, ఆయన భార్య, కోడలిని ఇందయ్య, ఆయన కుటుంబ సభ్యులు అసభ్య పదజాలంతో దూషించి, దాడి చేశారు. ఈ ఘటనలో బాధితులకు గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం


- సకాలంలో వచ్చి కాపాడిన పోలీసులు
- తండ్రీకుమారుడి మధ్య గొడవే కారణం



కౌన్సెలింగ్ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఫసియొద్దీన్

ముస్తాబాద్(సిరిసిల్ల): వృథా ఖర్చులు మానుకోవాలని.. సన్మార్గంలో నడవాలని చెప్పిన తండ్రి మాటలకు నొచ్చుకున్న ఓ యువకుడు క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు సకాలంలో రావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. హెడ్‌కానిస్టేబుల్ ఫసియొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సూర కొంరయ్యకు అతని కొడుకు కుమార్‌కు మధ్య బుధవారం గొడవ జరిగింది. డబ్బులు వృథాగా ఖర్చు చేయొద్దని తండ్రి మందలించాడు. అప్పులు తీర్చేందుకు స్థలాన్ని విక్రయించగా వచ్చిన డబ్బులను సైతం కుమారుడు అడగడంతో అతను నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. క్షణికావేశంలో కుమార్ బైక్‌పై పెట్రోల్ పోసి, నిప్పంటించేందుకు ప్రయత్నించాడు. కొంరయ్య అడ్డుకొని, కుమారుడిపై కోపగించుకున్నాడు. దీంతో కుమార్ అందరూ చూస్తుండగానే ఇంట్లోకి వెళ్లి, గడియ పెట్టుకున్నాడు. చీరతో ఉరేసుకొని, వేలాడుతున్నాడు. అదే సమయానికి అక్కడికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలు కొట్టి, ఫ్యాన్‌కు వేలాడుతున్న కుమార్‌ను కిందికి దించారు. సపర్యలు చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. అనంతరం తండ్రీకుమారుడికి కౌన్సెలింగ్ చేశారు. ఎలాంటి గొడవలు పెట్టుకోవద్దని, కుటుంబాన్ని, తల్లిదండ్రులను గౌరవించాలని కుమార్‌కు సూచించారు. పోలీసులు సకాలంలో రావడం వల్లే తమ కుమారుడు దక్కాడని కొంరయ్య దంపతులు విలపించారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కూనారంలో గర్భిణి ఆత్మహత్య



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని కూనారం గ్రామానికి చెందిన సంధ్య (24) బుధవారం పుట్టింట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఏడాది క్రితం సంధ్యకు వరంగల్‌కు చెందిన బొట్టు శ్రీకాంత్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఆరునెలల గర్భిణి. వారం రోజుల కిందట సంధ్య బోనాల కార్యక్రమానికి పుట్టింటికి వచ్చింది. బుధవారం తల్లిదండ్రులు కొట్టె రమాదేవి-రాజేందర్ పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతిచెంది ఉన్న కూతురును చూసి గుండెలు బాదుకున్నారు. ఘటనకు సంబంధించి కారణాలు తెలియలేదు. హైదరాబాద్‌లో ఉన్న సంధ్య సోదరుడు మహేందర్ వస్తేనే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తల్లిదండ్రులు పేర్కొన్నారు. కాల్వశ్రీరాంపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు గమ్యం చేరేవరకు శ్రమించాలి

- తెలంగాణ జాగృతి యువత జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్



విజేతలకు బహుమతి అందిస్తున్న మల్లేశ్

మల్లాపూర్(కోరుట్ల): విద్యార్థులు గమ్యం చేరేవరకు శ్రమించాలని తెలంగాణ జాగృతి యువత జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని రేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీల విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. మన దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, సావిత్రీబాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకొని, యువజన నాయకుడు కుందేళ్ల రాజేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుందేళ్ల నర్సయ్య, నాయకులు సురకంటి తిరుపతిరెడ్డి, బండారి వెంకటేశ్, బందెల నరేష్, నల్ల శేషు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ



అనూష యశస్విని నృత్య ప్రదర్శన

సిరిసిల్లకల్చరల్: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నృత్య ప్రదర్శన పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని అనూష యశస్విని ప్రతిభ కనబరిచారు. తృతీయ స్థానం సాధించడంతోపాటు రూ.3 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ నెల 2, 3వ తేదీల్లో ఈ పోటీలు నిర్వహించారు. విజ్ఞాన దర్శిని ఉమెన్స్ ఫెస్ట్ పేరిట రాష్ట్ర మహిళా కమిషన్ నిర్వహించిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా మహిళా టీచర్లు పాల్గొన్నారు. కొండాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆంగ్లం ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న అనూష యశస్విని కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమెను టీఎస్‌టీఎస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ గంట రవీందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి, జయరాజ్, కృష్ణకుమారి తదితరులు అభినందించారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామానికి చెందిన నాగపురి రాజ్‌కుమార్ (20) మంగళవారం రాత్రి రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. తమకు దక్కాల్సిన భూమి విషయమై నాన్నమ్మ నాగపురి వీరమ్మ, అత్త బుర్ర స్రవంతి మానసిక వేధింపులకు గురి చేస్తున్నారంటూ సెల్‌ఫోన్‌లో వాట్సాప్ మెస్సేజ్ పెట్టుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కొండ్రికర్లలో రైతు ఇంట్లో దొంగతనం

మెట్‌పల్లి(కోరుట్ల): మెట్‌పల్లి మండలంలోని కొండ్రికర్ల గ్రామంలో వెంకటేశ్ అనే రైతు ఇంట్లో దొంగతనం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్ బుధవారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలో దాచిన రూ.6 లక్షలతోపాటు మూడు తులాల బంగారం కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి, వివరాలు సేకరించారు. తెలిసినవారే దొంగతనం చేసి ఉంటారన్న అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.